కన్నోళ్లకు కన్నీళ్లు
గడప దాటి కష్టాలు



- ఇల్లు వదిలి వెళ్తున్న బాలికలు, యువతులు
- ప్రేమ పేరుతో వెళ్లి, కొన్నాళ్లకు తిరిగొస్తున్న జంటలు
- ఉమ్మడి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న మిస్సింగ్ కేసులు
- చట్టాలు, కేసులపై అవగాహన లేక అవస్థలు
- పోక్సో కేసులు నమోదైతే మరిన్ని ఇబ్బందులు

ప్రేమించుకోవడం.. ఇంట్లోంచి వెళ్లిపోవడం.. మోసపోయామని తెలుసుకొని తిరిగి రావడం సర్వ సాధారణమయ్యింది. ఈ కోవలోనే కొందరు యువతుల అదృశ్యానికి దారితీస్తోంది. బాలికలు, యువతులు కన్నవారిని కాదని గడప దాటుతూ.. కన్నోళ్లకు కన్నీళ్లు మిగుల్చుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ మధ్య కాలంలో మిస్సింగ్ కేసులు అధికమవుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ పరిస్థితికి సామాజిక మాధ్యమాలు కూడా ఓ కారణమని చెప్పవచ్చు.. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు, ఇంటర్‌నెట్ అందరికీ అందుబాటులోకి రావడంతో వీటి మోజులో పడి యువత చెడుదారులు వెతుక్కుంటున్నారన్న వాదనలూ లేకపోలేదు.

చాలా మంది ఆగం అవుతున్నారు



సీనియర్ న్యాయవాది ఉమామహేశ్వరి : ప్రేమ పేరుతో ఆగం అవుతున్నారు. చాలామంది ప్రేమ పేరుతో ఇల్లు వదిలి వెళ్లి, మోసపోయి తిరిగి వస్తున్నారు. శారీరక వాంఛ తీరిన తరువాత అతడు వదిలేయడంతో సదరు యువతి బాధితురాలిగా మారి పోలీసులను ఆశ్రయిస్తోంది. కేసు ట్రయల్ నడుస్తుండగానే బాధిత మహిళ బిడ్డకు జన్మనివ్వడం, బిడ్డతో సహా కోర్టులకు హాజరవుతున్న కేసులు ఎన్నో ఉన్నాయి.

మహబూబ్‌నగర్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆకర్షణనే ప్రేమ అని భావిస్తున్నారు... వెనుకా ముందు ఆలోచించడం లేదు.. పెద్దల పరువు, ప్రతిష్టలను పట్టించుకోవడం లేదు.. భవిష్యత్తు ఏమవుతుందన్న బెంగ లేదు.. బాలికలు, యువతులు కన్నవారిని కాదని గడప దాటుతున్నారు.. నమ్మిన వాడి వెంట వెళ్లి నట్టేట మునుగుతున్నారు. ఈ పరిస్థితికి సామాజిక మాధ్యమాలు కూడా ఓ కారణమని చెప్పవచ్చు.. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు, ఇంటర్‌నెట్ అందరికీ అందుబాటులోకి వచ్చాయి.

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితరాల్లో ఒకరితో ఒకరికి పరిచయాలు పెరుగుతు న్నాయి.. ఆ పరిచయాలు హద్దు లు దాటుతున్నాయి.. ఎవరు ఎవరితో ప్రేమలో పడుతున్నారో తెలియని పరిస్థితి నెలకొ న్నది. మైనర్లమా? మేజర్లమా అన్న ధ్యాస కూడా ఉండటం లేదు.

ప్రేమించుకోవడం.. ఇంట్లోంచి వెళ్లిపోవడం.. మోసపోయామని తెలుసుకొని తిరిగి రావడం సాధారణమయ్యింది. దీంతో కన్నవాళ్లకు కన్నీళ్లు.. గడప దాటిన వారికి కష్టాలు తప్పడం లేదు.

ఒక్క జిల్లాలోనే 180 మంది మిస్సింగ్

ఉమ్మడి పాలమూరు జిల్లాలో బాలికలు, యువతుల మిస్సింగ్ కేసులు కలవరానికి గురి చేస్తున్నాయి.. గత ఏడాది ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే

- మిగతా 7లో..

అనాలోచిత నిర్ణయాలతో అనర్థాలు

బాలికలు, యువతులు తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాలతో అనర్థాలు జరుగుతున్నాయి. కొందరు మైనారిటీ తీరకముందే ప్రేమలో పడుతుండగా, మరికొందరు సరిగ్గా 18 సంవత్సరాలు నిండిన వెంటనే వెళ్లిపోతున్నారు. అవతలి వ్యక్తిని గుడ్డిగా నమ్మి ఇంటి నుంచి వెళ్లిపోతున్న వారు కన్నవారి గురించి ఏమాత్రమూ ఆలోచించడం లేదు.. దీంతో తల్లిదండ్రులతో పాటు తోబుట్టువులు ఇబ్బందులకు గురవుతున్నారు. జీవితంపై అవగాహన, భవిష్య త్తుపై ఆలోచన లేకుండా ఇల్లు వదిలిన వారు కష్టాలపాలవుతున్నారు. వారిలో చా లా మంది తిరిగి తల్లిదండ్రుల చెంతకు చే రినా, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపో తోంది. ప్రతి ఏడాది వేసవి, పెళ్లిళ్ల సీజన్లో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగు తున్నట్లు తెలుస్తోంది.

వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- తెలంగాణ అవతరణ దిన వేడుకలపై సమీక్ష
- శకటాలు, స్టాళ్ల నిర్వహణపై సూచనలు


మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. జూన్ 2న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించనున్న అవతరణ దినోత్సవం ఏర్పాట్లపై గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ అవతరణ వేడుకల్లో లోటుపాట్లకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. వివిధ వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదికను రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను ప్రతిబింబించేలా శకటాలను ప్రదర్శించాలని సూచించారు. వివిధ శాఖల పనితీరును చాటేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వేడుకల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వర్తించేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

ఇసుక రీచ్‌లను గుర్తించాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి


వనపర్తి రాజీవ్ చౌరస్తా, మే 29 (ఆంధ్రజ్యోతి) : 'మన ఇసుక వాహనం' ద్వారా గృహ నిర్మాణాలకు ఇసుక అందించేందుకు మరికొన్ని రీచ్‌లను గుర్తించాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి శాండ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో కొత్తగా ఎక్కడెక్కడ ఇసుక రీచ్‌లను గుర్తించారు, వాటి భౌగోళిక పరిసితులు ఏమిటి అనే విషయాలను చర్చించారు. తూంపల్లి, వీర రాఘవపూర్ రీచ్‌ల నుంచి 'మన ఇసుక వాహనం' ద్వారా ఇసుక తీసుకోవాలని కమిటీ తీర్మానించింది. మదనాపూర్ మండలంలోని కొత్తపల్లి, దుప్పల్లి రీచ్‌లను పరిశీలించామని, నిబంధనలకు అనుగుణంగా ఇసుక లభ్యత లేదని మైన్స్ అధికారి తెలిపారు. ఆన్‌లైన్ మ్యాప్ ద్వారా పరిశీలించిన కలెక్టర్, మరో మారు క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని కమిటీ సభ్యులను ఆదేశించారు. పెద్దమందడి మండలం చిలకటోనిపల్లి, కర్వెన గ్రామాల్లోని రీచ్‌లను కూడా పరిశీలించామని, అక్కడ నిబంధనల ప్రకారం ఇసుక లభ్యత లేదని సభ్యులు తెలిపారు. దాన్ని రీచ్‌గా పరిగణించి ఇసుకను తీసుకోలేమని నిర్ధారించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మైన్స్ ఏడీ గోవిందరాజులు, భూగర్భ జల శాఖ ఏడీ దివ్యజ్యోతి, డీఎల్పీవో రఘునాథ్, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'నకిలీ' నియంత్రణపై ప్రత్యేక దృష్టి

- వర్షాల దృష్ట్యా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి
- సమీక్షా సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి) : నకిలీ విత్తనాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, సరఫరా కాకుండా చూడాలని జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిరంతరం కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం ముందుస్తుగా ప్రారంభమై నిరంతరం కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడైనా రోడ్డుపాడైనా, నీరు నిలిచినా అక్కడ ప్రమాదాలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా కఠినమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు నిత్యం దుకాణాలు, గోదాములలో తనిఖీలు చేపట్టాలని సూచించారు. గుర్తింపు పొందిన దుకాణాల్లో, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రానున్న బక్రీద్ పండగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పశువుల అక్రమ రవాణా జరుగకుండా చూడాలని, జిల్లా సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ ఉండాలని ఆదేశించారు. డయల్ 100, బ్లూకోల్ట్స్ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలన్నారు. నమోదు అయిన కేసులకు సంబంధించిన సీడీ ఫైల్స్‌ను రైటర్లు సీసీటీఎన్ఎస్ ద్వారా ఆన్‌లైన్లో పొందుపర్చాలన్నారు. లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై తీసుకున్న చర్యలను నివేదిక ద్వారా పంపించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా గస్తీ నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు పూర్తిచేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. ఆయా కేసుల్లో అరెస్టులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. కోర్టు డ్యూటీ అధికారితో వారాంతంలో సమీక్షా సమావేశం నిర్వహించి కోర్టులో జరిగే ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా, నిందితులకు శిక్ష పడేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ మొగిలయ్య, అలంపూర్, గద్వాల, శాంతినగర్ సీఐలు రవిబాబు, శ్రీను, టాటాబాబు, ఎస్ఐలు పాల్గొన్నారు.


శ్రీశైలం జలాశయంలో చిల్ల నీరు

శ్రీశైలం ప్రాజెక్టుకు పెరిగిన వరద

- జలాశయానికి 20 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో
- ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి

6

ఉమ్మడి పాలమూరు జిల్లాలో మోస్తరు వర్షం

- ఊట్కూరులో 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం

7

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

7


కృష్ణానదిలో వలలు గుంజుతున్న కార్మికులు (ఫైల్)


నదీ తీరంలో ఎండు చేపలను ఏరుతున్న మత్స్య కార్మికులు (ఫైల్)


కృష్ణానది తీరంలో డేరా కింద పడుకున్న కార్మికులు

కృష్ణమ్మ ఒడిలో వెట్టి చాకిరీ

- నిషేధిత వలలతో చిరు చేపల వేట
- ఇతర రాష్ట్రాల నుంచి మత్స్య కార్మికులు
- అరకొర వేతనాలు ఇస్తున్న దళారులు
- గడువు ముగిసినా వదలక అవస్థలు

పెంట్లవెల్లి, మే29 (ఆంధ్రజ్యోతి) : కృష్ణానది తీరాన వందల మంది మత్స్య కార్మికులు వెట్టి చాకిరీలో మగ్గిపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని పెంట్లవెల్లి, జటప్రోలు, కొల్లాపూర్ మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, వేంకల్, అమరగిరి గ్రామాల పరిధిలో చేపలవేట విస్తృతంగా కొనసాగుతుంటోంది. నిషేధిత వలలతో చిన్న చేపలను పట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొవ్వూరు, రాజమండ్రి ప్రాంతాలకు చెందిన కొందరు దళారులు బిహార్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాల నుంచి మత్స్యకారులను రప్పిస్తారు. వారితో పగలు, రాత్రి తేడా లేకుండా నిషేధిత వలలతో చిన్న చేపలను పట్టిస్తారు. ఒక పట్టుకు (స్థలం) 25 నుంచి 30 మంది అవసరం అవుతారు. ఇలా దాదాపు 25 పట్టులకు వందల సంఖ్యలో కార్మికులు పని చేయాల్సి ఉంటుంది. వీరితో రాత్రి పగలు తేడా లేకుండా వలను గుంజిస్తారు. చాలీచాలని కూలి చెల్లిస్తూ పనులు చేయిస్తారు. వారిలో చాలా మంది మైనర్లు ఉంటారు. కష్టమైన ఈ పని చేయలేక కొందరు పారిపోయేందుకు ప్రయత్నం చేస్తుంటారు. మరి కొందరు నదిలో ఈదుతూ అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు చేసే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలున్నాయి. ఇంకా కొందరు నదీ తీరం వెంబడి నడుచుకుంటూ పెంట్లవెల్లికి చేరుకుంటారు. చార్జీలకు స్థానికుల నుంచి డబ్బులు అడుక్కొని స్వస్థలాలకు వెళ్తుంటారు. సాధారణంగా వీరి పని ప్రతీ సంవత్సరం నవంబరులో ప్రారంభమై మార్చి నెలలో ముగుస్తుంది. కానీ ఈ సంవత్సరం వారితో ఇంకా పని చేయిస్తూనే ఉన్నారు. ఇటీవల కార్మికుల కుటుంబ సభ్యులు జిల్లా అధికారులను ఆశ్రయించడంతో 38 మంది కార్మికులకు వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించి స్వగ్రామాలకు పంపించారు. ఇలాగే గతంలో పలువురు కార్మికులను తహసీల్దార్, ఎస్ఐ చొరవ చూపించి వారి ఊర్లకు పంపించారు.


వెట్టి చాకిరీ నుంచి విముక్తి పొందిన కార్మికులతో అధికారులు (ఫైల్)

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

- జేఏసీ చైర్మన్ నామాని సునిందర్

7

త్వరలో పూర్తి స్థాయి వైద్యసేవలు

- టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్
- జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న టీవీవీపీ కమిషనర్

గద్వాల న్యూటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో త్వరలోనే పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందేలా కృషి చేస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) కమిషనర్ అజయ్‌కుమార్ అన్నారు. అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిని గురువారం డాక్టర్లు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్యులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకటి, రెండు నెలల్లో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించనున్నట్లు తెలిపారు. అక్కడ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చూసేందుకే ప్రత్యేకంగా వచ్చినట్లు తెలిపారు. ఆ ఆసుపత్రిలో 85 శాతం అన్ని పరికరాలు ఉన్నాయని, లేని వాటిని వెంటనే తెప్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించామన్నారు. సివిల్, ఎలక్ట్రికల్ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. మరో మూడు నెలల్లో ప్రజలకు వైద్యసేవలు అందేలా చూస్తామన్నారు. ఆయన వెంట వనపర్తి జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగారావు, డీసీహెచ్ఎస్ రమేశ్, గద్వాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగేశ్వర్‌రావు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వినోద్ ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్

- ఉన్న 12 లో ఆరు గేట్ల మూసివేత
- ఇబ్బంది పడిన వాహనదారులు


పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఏపీ వైపు నుంచి తెలంగాణ వైపునకు నెమ్మదిగా కదులుతున్న వాహనాలు

6

రాష్ట్రానికి రానున్న నలుగురు కొత్త ఐఏఎస్‌లు

హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): 'సివిల్ సర్వీసెస్ పరీక్ష-2024' ద్వారా ఎంపికైన నలుగురు కొత్త ఐఏఎస్ అధికారులు రాష్ట్రానికి రానున్నారు. తెలంగాణతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి మొత్తం 180 మంది ఐఏఎస్‌లను ఆయా రాష్ట్రాలకు కేటాయిస్తున్నట్లు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ(డీవోపీటీ) వెల్లడించింది. రాష్ట్రానికి రానున్న నలుగురిలో ఇద్దరు సొంత రాష్ట్రం తెలంగాణకు చెందిన వారు కాగా... మిగతా ఇద్దరు ఇతర రాష్ట్రాలకు చెందినవారని తెలిపింది. అలాగే ఇద్దరు ఐఏఎస్‌లు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్)కు చెందినవారు కాగా, మరో ఇద్దరు ఇతర వెనుకబడిన వర్గాల(ఓబీసీ)కు చెందినవారు ఉంటారని డీవోపీటీ పేర్కొంది.

విస్తరణలో మాదిగలకు స్థానం కల్పించాలి

- అధిష్ఠానానికి విజ్ఞప్తి చేయనున్న ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ, మే 29 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు అవకాశం కల్పించాలని ఆ వర్గానికి చెందిన నలుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఢిల్లీ చేరుకున్నారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు మందుల సామ్యూల్, కవ్వంపల్లి సత్యానారాయణ, అడ్లూరి లక్ష్మణ్, తోట లక్ష్మీకాంతరావు మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ఈ విషయంపై ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. ఇప్పుడు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు చెప్పాలని ఢిల్లీకి వచ్చామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో దాదాపు 60 లక్షలు వరకు ఉన్న తమకు క్యాబినేట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమని చెప్పారు.

మంత్రిపై అసభ్య పోస్టు .. బీఆర్‌ఎస్ నేత అరెస్ట్

కాటారం, మే 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబుపై సోషల్‌మీడియాలో అభ్యంతరకర పోస్టు పెట్టిన కాటారం బీఆర్‌ఎస్ నాయకుడు జక్కు శ్రావణ్‌ను హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం ఖానాపూర్‌లో బంధువుల ఇంట్లో ఉన్న శ్రావణ్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఈ విషయంపై ఎలాంటి సమాచారం లేదని స్థానిక పోలీసులు తెలిపారు. మరోవైపు శ్రావణ్‌ను నాంపల్లి కోర్టులో హాజరుపర్చగా కోర్టు బెయిల్ మంజూరు చేసిందని బీఆర్‌ఎస్ నేతలు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 80 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని ఇందులో ఆర్థిక ఇబ్బందుల కారణంగా 60 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.



సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావును కలిసిన తెలంగాణ కేడర్‌కు కేటాయించిన 2024 బ్యాచ్ ట్రైయినీ ఐఏఎస్‌ల బృందం

రేపే మిస్ వరల్డ్-2025 ఫైనల్

హైటెక్స్‌లో ప్రత్యేక ఆకర్షణగా వేదిక .. మల్టీ మీడియా చాలెంజ్‌లో విజేతలుగా నలుగురు



'మల్టీమీడియా చాలెంజ్' విజేతలు మిస్ థాయ్‌లాండ్, మిస్ కామెరూన్, మిస్ డోమినికన్ రిపబ్లిక్, మిస్ మాంటెనెగ్రో

హైదరాబాద్, మే 29(ఆంధ్రజ్యోతి): గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రపంచ అందాల పోటీలు తుది దశకు చేరుకున్నాయి. శనివారం సాయంత్రం మిస్ వరల్డ్-2025 ఫైనల్ కోసం నగరం సిద్ధమైంది. సాయంత్రం 6 గంటల నుంచి హైటెక్స్‌లో జరగనున్న ఈ పోటీల కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. విదేశాల నుంచి వచ్చిన ప్రత్యేక డిజైనర్లు ప్రధాన వేదికను ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. శనివారం వేడుకల్లో భాగంగా.. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండేజ్, ఇషాన్ ఖట్టర్‌తో పాటు పలువురు నటులు నృత్యప్రదర్శన ఇవ్వనున్నారు. ఫైనల్ పోటీల్లో న్యాయనిర్ణేతలుగా ప్రముఖ నటుడు సోనూ సూద్, మేఘా ఇంజినీరింగ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి, 2017 మిస్ వరల్డ్ విజేత మానుషి చిల్లర్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా.. ఏటా మిస్ వరల్డ్ ఫైనల్లో ఇచ్చే మానవతావాది (హ్యూమానిటేరియన్) పురస్కారాన్ని ఈసారి సోనూసూద్‌కు ఇవ్వనున్నారు. అలాగే రెండు రోజుల క్రితం నిర్వహించిన 'మల్టీమీడియా చాలెంజ్' విజేతలను మిస్ వరల్డ్ సంస్థ గురువారం రాత్రి ప్రకటించింది. ఇందులో నాలుగు ఖండాల నుంచి నలుగురు విజేతలున్నారు. ఏషియా-ఓషియానా నుంచి థాయ్‌లాండ్, యూరప్ నుంచి మాంటేనెగ్రో, ఆఫ్రికా నుంచి కామెరూన్, అమెరికా-కరేబియన్ నుంచి డొమినికన్ రిపబ్లిక్ దేశాల ప్రతినిధులు ఇందులో విజేతలుగా నిలిచారు. దీంతో ఫైనల్‌లో టాప్-40లో వీరి స్థానం ఖరారైంది.

'మిస్ వరల్డ్'కు రూ.300 కోట్లా..?

- మహిళా హక్కుల ఉద్యమకారుల ధ్వజం

హైదరాబాద్ సిటీ, మే 29 (ఆంధ్రజ్యోతి): 'ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడానికి ప్రభుత్వం దగ్గర పైసల్లేవ్.. కానీ, మిస్ వరల్డ్ అందాల పోటీలకు మాత్రం రూ.300 కోట్లు ఖర్చుపెడతారా?'అంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై మహిళా హక్కుల ఉద్యమకారులు మండిపడ్డారు. మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మిస్ వరల్డ్ పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీకి ఆయా సంఘాల నాయకులు మద్దతు ప్రకటించారు. శనివారం జరిగే మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలేను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పదోవంతు డిగ్రీ కాలేజీల్లో సున్నా ప్రవేశాలు

ఒక్కరూ చేరని కాలేజీలు 74 .. 60,436 మందికి ప్రవేశాలు ఖరారు..దోస్త్ తొలి విడత జాబితా విడుదల



హైదరాబాద్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పదోవంతు డిగ్రీ కాలేజీల్లో ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోలేదు. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26)లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన దోస్త్-2025 తొలి విడత అడ్మిషన్లలో రాష్ట్రంలోని 805 కాలేజీల్లో 74 కాలేజీల్లో ఒక్కరూ అడ్మిషన్‌కు వెబ్ ఆప్షన్ ఇవ్వలేదు. అందులో రాజన్న-సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కూడా ఉంది. గతేడాది మాదిరే ఈసారి యూజీ డిగ్రీలో 36శాతం (21,758 మంది) కామర్స్ కోర్సులు ఎంచుకోగా, తర్వాతి స్థానాల్లో ఫిజికల్ సైన్సెస్ 15,249 మంది, లైఫ్ సైన్సెస్ 11,005 మంది, ఆర్ట్స్ 5,986 మంది, ఇతర కోర్సులు 6,438 మంది ఎంచుకున్నారు. 58,575 మంది ఇంగ్లీష్ మాధ్యమం, 1,552 మంది తెలుగు, 309 మంది హిందీ మాధ్యమం ఎంచుకున్నారు. తొలి జాబితాలో సీట్లు విద్యార్థినులే అధికసీట్లు పొందారు. ఈ నెల మూడో తేదీ నుంచి ప్రారంభమైన దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో 89,572 మంది విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోగా 65,191 మంది వెబ్ ఆప్షన్లు సమర్పించారు. వారిలో 60,436 మంది సీట్లు లభించాయి. రాష్ట్ర వ్యాప్తంగా 805 డిగ్రీ కాలేజీల్లో 3,71,096 సీట్లు ఉన్నాయి. దోస్త్ తొలి విడత అడ్మిషన్ల జాబితాను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, ఉపాధ్యక్షులు ఈ.పురుషోత్తం, ఎస్‌కె. మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు గురువారం విడుదల చేశారు. తొలి జాబితాలో సీట్లు లభించిన వారు ఈ నెల 30 నుంచి జూన్ ఆరో తేదీ వరకూ నిర్దిష్ట ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని, లేకపోతే సీటు రద్దవుతుందని బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 30 నుంచి జూన్ 9వరకూ దోస్త్ రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తామని, 13న సీట్లు కేటాయిస్తామన్నారు.

సీట్ల భర్తీలో నిజాం కాలేజీ టాప్

హైదరాబాద్‌లోని నిజాం కాలేజీ 1,197 సీట్లకు 1,170 (97.74%) సీట్ల భర్తీతో మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కోఠి మహిళా కాలేజీ (వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం)లో 93.19%, మూడో స్థానంలో ఉన్న సిటీ కాలేజీలో 88.89, బేగంపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 82.69, ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 80.98, నారాయణగూడలోని బాబు జగ్జీవన్‌రాం డిగ్రీ కాలేజీలో 80.29, కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కాలేజీలో 73.01, నాంపల్లిలోని ఇందిరా ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా కాలేజీలో 68.56, హన్మకొండలోని యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో 66.1, నిజామాబాద్‌లోని గిరిరాజ్ ప్రభుత్వ కాలేజీలో 65.75% సీట్లు భర్తీ అయ్యాయి. ఈసారి దోస్త్‌లో 10 మంది టాప్ ర్యాంకర్లలో నలుగురు కోఠి మహిళా కాలేజీని ఎంచుకున్నారు. వారిలో ముగ్గురు ఫిజికల్ సైన్సెస్, ఒకరు లైఫ్ సైన్స్ సబ్జెక్ట్ ఆప్ట్ చేసుకున్నారు. ఇంటర్‌లో 99.60% మార్కులతో దోస్త్‌లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు పొందిన వసంత్ కుమార్, 99.40% మార్కులతో ఎనిమిదో ర్యాంకు పొందిన బెక్కరి అక్షిత కూడా నిజాం కాలేజీలో కామర్స్ విభాగంలో సీటు పొందారు.

75% హాజరుతోనే ఫీజు రీయింబర్స్‌మెంట్

డిగ్రీ కోర్సుల్లో కనీసం 75% తరగతులకు హాజరైన విద్యార్థులకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని గురువారం జరిగిన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ల సమావేశంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. మరోవైపు, మూడేళ్ల డిగ్రీ కోర్సులో ఆరు సెమిస్టర్లలో ప్రతి సెమిస్టర్‌కు 25 క్రెడిట్స్ చొప్పున 150 క్రెడిట్స్ ఉండగా, వాటిని 142కి తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. చివరి సంవత్సరం రెండు సెమిస్టర్లలో ఒక మైనర్ సబ్జెక్ట్, ప్రథమ/ద్వితీయభాషలకు కలిపి 15 చొప్పున 30 క్రెడిట్స్ తొలగించారు. ఐదో సెమిస్టర్‌లో మల్టీ డిసిప్లినరీ కోర్సు 4, అదనంగా నేర్చుకునే ఇతర కోర్సులకు 7 క్రెడిట్స్, చివరి సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్‌కు 4, ఇతర అదనపు కోర్సులకు 7 క్రెడిట్స్ కేటాయించారు. చివరి రెండు సెమిస్టర్లలో విద్యార్థులు రెండు ప్రధాన సబ్జెక్టులపై దృష్టి సారించాలని, ఇంటర్న్‌షిప్‌తోపాటు అదనపు కోర్సులు నేర్చుకోవాలన్న లక్ష్యంతో కొత్త క్రెడిట్స్ విధానం రూపొందించామని బాలకిష్టారెడ్డి తెలిపారు.

భవనంపై నుంచి దూకి బీఆర్ఎస్ నేత ఆత్మహత్య

మాజీ డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్ వేధింపుల వల్లేనంటూ బంధువుల ఆందోళన

బోరబండ ప్రాంతంలో ఉద్రిక్తత



ఎండీ సర్దార్ (ఫైల్)

బోరబండ, మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ సర్దార్ (33) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మాజీ డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులే సర్దార్ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన బంధువులు గురువారం ఆందోళనకు దిగారు. దీనితో బోరబండ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఎండీ సర్దార్ ఎస్ఆర్‌టీ నగర్‌లో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి తన ఇంటి నాలుగో అంతస్తు నుంచి కిందికి దూకారు. రక్తపు మడుగులో పడి ఉన్న ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు గుర్తించారు. బాబా ఫసియుద్దీన్ దంపతుల వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్యకు పాల్పడ్డారంటూ బంధువులు, బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బోరబండ ప్రాంతంలో, ఫసియుద్దీన్ నివాసం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సర్దార్ సోదరుడు ఇబ్రహీం ఫిర్యాదు మేరకు ఫసియుద్దీన్, ఆయన భార్య హబీబాషేక్, పీఏ సప్తగిరితోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన సోదరుడు ఇటీవల ఇంటి ఆధునీకరణ పనులు చేపట్టారని.. దీనితో డబ్బులు డిమాండ్ చేస్తూ వారు వేధించారని ఇబ్రహీం ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వేధింపులు తట్టుకోలేక సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. సర్దార్ మృతదేహాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

'జనభేరి' సక్సెస్‌తో మరింత ఉత్సాహం

- బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల



సమావేశంలో మాట్లాడుతున్న రాచాల యుగంధర్‌గౌడ్

వనపర్తి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : జనభేరి సభ విజయవంతం కావడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని, ఇంకా ఎక్కువ ఉత్సాహంతో పని చేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం నిర్వహించిన జనభేరి సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా జనం తరలివచ్చారని, వారందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీకి ఆడపడుచుల అండదండలు మెండుగా ఉన్నాయనడానికి జనభేరి సభ ఒక ఉదాహరణ అని చెప్పారు. రాజకీయ పార్టీలకు గ్రామస్థాయి నుంచి పటిష్ఠమైన వ్యవస్థ, క్యాడర్ ఉంటుందని, వాటికి దీటుగా జనభేరి సభ విజయవంతం కావడం వెనుక జిల్లా ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకానికి గుర్తుగా నిలుస్తోందన్నారు. కొద్ది మందితో ప్రారంభమైన బీసీ పొలిటికల్ జేఏసీ నేడు ఒక వ్యవస్థగా మారిందని చెప్పారు. జనభేరి సభ ద్వారా ప్రజల ముందు పెట్టిన డిమాండ్లను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లోపు పరిష్కరించాలని, లేదంటే బీసీ పొలిటికల్ జేఏసీ తరఫున అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి, గెలిపించుకుంటామని చెప్పారు. సమావేశంలో రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పాండురంగ యాదవ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షుడు రాఘవేందర్, వీవీ గౌడ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న యాదవ్, పట్టణ అధ్యక్షుడు దేవర శివ, అంజన్న యాదవ్, మహేందర్ నాయుడు, అక్కల మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- ఎస్ఎస్‌కె సమాజ్ అఖిల భారతీయ ఉపాధ్యక్షుడు నాగూరావు నామాజీ



సమావేశంలో మాట్లాడుతున్న నాగూరావు నామాజీ

నారాయణపేట రూరల్, మే 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎస్ఎస్‌కె సమాజ్ అఖిల భారతీయ ఉపాధ్యక్షుడు నా గూరావు నామాజీ అన్నారు. గురువారం పేట జిల్లా కేంద్రంలోని ధూల్‌పేట్‌లో సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'పది', ఇంటర్, నీట్, ఐఐటీల్లో ప్రతిభ కనబరిచిన ఎస్ఎస్‌కె సమాజ్ విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నాగూరావు నామాజీ మాట్లాడుతూ చదువులో విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు, గురువులకు, గ్రామానికి పేరుప్రఖ్యాతులు తేవాలన్నారు. ఎస్ఎస్‌కె సమాజ్ ధూల్‌పేట్ అధ్యక్షుడు నారాయణరావు నగిరి, జిల్లా, గ్రామ సభ అధ్యక్షులు, సమాజ పెద్దలు పాల్గొన్నారు.

రాబోయేది డిజిటల్ మీడియానే

- పాత్రికేయులు జ్ఞానాన్ని పెంపొందించుకుంటూనే వార్తలు రాయాలి
- రాబోయే రోజుల్లో రానున్నది అంతా డిజిటల్ మీడియానే
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి



జర్నలిస్టుల శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి

మన్ననూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : పాత్రికేయులు నిత్యం జ్ఞానాన్ని పెంపొందించుకుంటూనే కొత్తదనంతో కూడిన వార్తలను వారివారి పత్రికల ద్వారా ప్రజల ముందుంచాలని, రాబోయే రోజుల్లో అంతా డిజిటల్ మీడియానే ఉంటుందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం మన్ననూరు అటవీ పర్యాటక వనమాలిక, ఆవరణలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో అటవీశాఖ సౌజన్యంతో రెండు రోజుల పాత్రికేయుల పునశ్చరణ తరగతులను గురువారం ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా జర్నలిజంలో ఎదురవుతున్న సమస్యలు, వర్తమానం వివిధ అంశాలపై తరగతులు బోధించారు. జర్నలిస్టులు వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేలా 10 పుస్తకాల కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ శిక్షణా తరగతులు నల్లమలలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో జరగడం శుభకరమని, శిక్షణల ద్వారా పాత్రికేయులు నాణ్యత కలిగిన వార్తలను ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల ద్వారా ప్రజెంటేషన్ చేసే అవకాశం కల్గుతుందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకువచ్చేలా పాత్రికేయులు నిత్యం వార్తలు అందిస్తే, ప్రభుత్వం సమస్యల పరిష్కారంపై దృష్టి సారించే ఆస్కారం ఉంటుందన్నారు. ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ డిజిటల్ మీడియా జర్నలిజం ఆవిష్కృతమైన వేళ పాత్రికేయ మిత్రులు నూతన విధానాలను అవలంబిస్తూ నిత్యం కొత్తకోణంలో ప్రజా సమస్యలను ప్రతిబింబించే ఆసక్తికరమైన వార్తలను రాయాలన్నారు. డిజిటల్ మిడియా అయినా, ప్రింట్ మీడియా అయినా వాస్తవాలు తెలుసుకొని ప్రజెంటేషన్ చేయాలన్నారు. అధునికంగా వస్తున్న గూగుల్, వాట్సాప్‌లను ఉపయోగించుకొని ఎక్స్‌క్లూజివ్ వార్తలు ఇస్తే ప్రాధాన్యం పెరుగుతుందన్నారు. సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రిక పేర ఆనాడు మొట్టమొదటి రాజకీయ సామాజిక పత్రిక నడిపించిన చరిత్ర గర్వించదగిన విషయమన్నారు. భాష తప్పొప్పులు, దిద్దుబాటు అనే అంశంపై విశాలాంధ్ర సంపాదకులు ఆర్‌వీ రామారావు మాట్లాడుతూ స్థానిక ప్రజలకు అర్థమయ్యే భాషలో వార్తా ప్రచురణ ఉండాలని, పత్రికలతో పాటుగా పుస్తకాలను తరచూ చదవడం, రాయడం వలన తెలుగు భాషపై పట్టు దొరుకుతుందని, అప్పుడే వార్తా కథనాల్లో తప్పులు దొర్లకుండా విలేకరులు వార్తలు రాయగలరన్నారు.

కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి, రాములు, తెలంగాణ మీడియా సిబ్బంది పూర్ణచందర్‌రావు, శనేశ్వర రెడ్డి, ఓఎస్‌డీ రహిమాన్ స్థానిక పాత్రికేయులు సాయిబాబ, ప్రభాకర్, వెంకటయ్య, శ్రీధర్, లక్ష్మీపతితో పాటుగా 90 మంది పాత్రికేయులు పాల్గొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జడ్చర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల, మహబూబ్‌నగర్ శివారులో ట్రిబుల్ ఐటీ కేంద్రంను మంజూరు చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు గురువారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద క్షీరాభిషేకం చేశారు. బాదిమి శివకుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి అల్వాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బుర్ల వెంకటయ్య, అశోక్‌యాదవ్, బాదిమి రవిశంకర్, బుక్క వెంకటేశ్, మినాజ్, వంశీచారి, పెద్ది బాలకృష్ణ, ఖాజా పాల్గొన్నారు.

రైతు సంక్షేమ పాలనకు చిరునామా

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమ పాలనకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిరునా మాగా నిలిచిందని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షు డు వేముల శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకట నలో తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో రేవం త్‌రెడ్డిని మించినోళ్లు లేరని, రైతులకు, ప్రజలకు ఎప్పుడు ఏది కావాలో గుర్తించ గలిగిన నాయకు డని పేర్కొన్నారు. ఇటీవల వడగండ్ల వాన, అకాల వర్షాలతో రాష్ట్రంలో 41,361 మంది రైతులుకు సం బంధించి, రూ.51528 కోట్ల పంట నష్టం వాటిల్లిం దని తెలిపారు. ఈ నేపథ్యంలో చిన్న సన్నకారు రైతులపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభు త్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున అందించ నున్నదని తెలిపారు. అందుకోసం ప్రభుత్వం ని. దులు విడుదల చేయడంతో సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు పెరిగిన వరద

- జలాశయానికి 20 వేల క్యూసెక్కులకు పైగా ఇన్‌ఫ్లో
- ఎడమ గట్టు కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి

దోమలపెంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఎగువన కృష్ణా పరివాహక ప్రాంతంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పెరిగింది. సుంకేసుల నుంచి 4,379 క్యూసెక్కులు, జూరాల ప్రాజెక్టు గేట్ల ద్వారా 83,616 క్యూసెక్కులు, మొత్తంగా 87,995 క్యూసెక్కుల నీరు శ్రీశైలం డ్యాం వైపుకు వస్తోంది. 22,527 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతోంది. గడిచిన 24 గంటల వ్యవధిలో ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రంలో 12,713 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి 3.338 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. తాగు, సాగు అవసరాలకు ఎంజీకేఎల్ఐ కాలువ ద్వారా 800 క్యూసెక్కుల నీటిని మళ్లిస్తున్నారు. దీంతో గురువారం డ్యాంలో పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 818 అడుగులకు చేరింది. పూర్తి సామర్థ్యం 215.807 టీఎంసీలకు గాను 39.3750 టీఎంసీల నీటి నిల్వ నమోదు అవుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టు నుంచి 13,513 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లో అవుతోంది. జూరాల గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరేందుకు మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉందని డ్యాం అధికారులు తెలిపారు.

బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం

- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

దేవరకద్ర, మే 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో మునిసిపాలిటీ, మండలాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయం అని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన దేవరకద్ర, భూత్పూర్, కొత్తకోట ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎంపీ మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బీజేపీ చేసిన అభివృద్ధి, సంక్షమ పథకాలపై ప్రజలకు వివరించినప్పుడే ప్రజలకు బీజేపీపై నమ్మకం వస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త కష్టపడి బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్

- ఉన్న 12లో ఆరు గేట్ల మూసివేత
- ఇబ్బంది పడిన వాహనదారులు

అలంపూరు చౌరస్తా, మే 29 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద గురువారం పలుమార్లు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ పేరుతో రెండు వైపులా ఉన్న 12 గేట్లలో ఆరింటిని మూసివేశారు. దీంతో ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న వేలాది వాహనాలకు అటు 3 ఇటు 3 గేట్ల నుంచి మాత్రమే వెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. దీంతో పలుమార్లు వాహనాలు ప్లాజాకు రెండు వైపులా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు, టోల్‌ప్లాజా సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు.

ఫాస్టాగ్ ఉన్నా టోల్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది.

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ఎర్రవల్లి, మే 29, (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రవల్లి మండలంలోని కొండేరు స్టేజి వద్ద సోమవారం జాతీయ రహదారిపై వాహనం వ్యక్తిని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన పోలీసులు గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉంటుందన్నారు. మృతదేహం గద్వాల ఆసుపత్రిలో ఉందని, ఎవరైనా గుర్తిస్తే ఇటిక్యాల పోలీసులను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కృష్ణ, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఎక్స్‌కవేటర్ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని గుడెబల్లూరు శివారులో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడెబల్లూరు గ్రామానికి చెందిన వడ్డె ఆంజనేయ (35) తన బైక్‌పై నల్లగట్టు నుంచి గ్రామానికి వస్తుండగా ముందు వెళ్తున్నా ఎక్స్‌కవేటర్‌ను ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ నవీద్, సిబ్బందితో కలిసి హుటాహుటిన చేరుకుని అతన్ని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గురువారం తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి డ్రైవర్ దుర్మరణం


మంగ సాయిబాబు (ఫైల్)

కల్వకుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలంలోని తుర్కలపల్లి గ్రామంలో గురువారం ట్రాక్టర్‌పై నుంచి పడి మంగ సాయిబాబు(23) డ్రైవర్ మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయిబాబా వానాకాలం పంటలు సాగు చేసేందుకు తన పొలం దున్ని, వేరే పొలం దున్నడానికి ట్రాక్టర్‌తో బయలుదేరాడు. బ్రేక్ వేసే క్రమంలో ట్రాక్టర్ ఒక వైపు వంగిపోవడంతో వెంటనే అతను కిందికి దూకగా తల వెనక భాగంలో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు ఏడాది క్రితమే వివాహం కాగా, ఆమె మూడు నెలల గర్భిణి అని గ్రామస్థులు చెప్పారు. తండ్రి బుచ్చయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

» కలకలం రేపిన సూసైడ్ నోట్

గద్వాల, మే 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని గోనుపాడు శివారులో ఉన్న ప్రభుత్వ డబుల్ బెడ్రూం ఇంటిలో పట్టణానికి చెందిన డ్రైవర్ వడ్డె శ్రీనివాసులు (45) గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పదేళ్లు గడుస్తున్నా ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీలో ఆత్మహత్య ఘటన చోటు చేసుకోవడం స్థానికులను కలవరానికి గురిచేసింది. తెరిచి ఉన్న ఇంట్లో సీలింగ్ కొక్కేనికి చీరతో ఉరివేసుకున్న వ్యక్తి కనిపించడంతో స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చనిపోయిన వ్యక్తిని డ్రైవర్‌గా గుర్తించి పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయిజకు చెందిన శ్రీనివాసులు కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం గద్వాలకు వచ్చి స్థానిక పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. మతిస్థిమితం లేని తన తల్లి రెండు రోజుల క్రితం గోనుపాడులో తిరుగుతున్నట్లు తెలుసుకున్న ఆయన బుధవారం రాత్రి అక్కడి వెళ్లినట్లు పోలీసులకు తెలిసింది. ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఓ మహిళే కారణమని సూసైడ్ నోట్

శ్రీనివాసులు జేబులో సూసైడ్ నోట్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 'తన చావుకు కారణం పట్టణంలోని ఒక మహిళ అంటూ'.. లేఖలో రాసినట్లు గుర్తించారు. కొంతకాలంగా ఆమెతో పరిచయం పెంచుకుని చనువుగా ఉంటున్న శ్రీనివాసులు ఇటీవల ఆమె మరికొంత మందితో చనువుగా ఉండటాన్ని జీర్ణించుకోకపోతున్నట్లు లేఖలో ఉంది. ఆమెపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో కోరినట్లు తెలిసింది. మృతుడి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు స్వీకరించిన అనంతరం మరింత దర్యాప్తు చేపట్టి పూర్తి వివరాలు వెల్లడిస్తామని రూరల్ ఎస్‌ఐ తెలిపారు.

పొలం బాట విషయంలో ఘర్షణ: కేసు నమోదు

అయిజ, మే 29 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండ గ్రామంలో పొలం బాట విషయంలో ఇరువురి ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం సాయంత్రం మేడికొండ గ్రామానికి చెందిన రాఘవేంద్రగౌడ్, గోపిగౌడ్ మధ్య పొలం బాట విషయంలో గొడవ పడ్డారని తెలిపారు. గోపిగౌడ్‌కు గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు గద్వాల ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై గోపిగౌడ్ సోదరుడు తిరమలేష్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

» ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

వనపర్తి లీగల్ కంట్రిబ్యూటర్, మే 29 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను ప్రియుడితో కలిసి హత్య భార్య చేయగా వనపర్తి జిల్లా కోర్టు గురువారం జీవిత కాల జైలు శిక్ష విధించినట్లు ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. గోపాల్‌పేట మండలం తాడుపర్తి గ్రామానికి చెందిన ఆకునమోని మల్లమ్మ, బాలస్వామి భార్యాభర్తలు. మల్లమ్మచింతల వెంకటయ్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తుంది. వారికి అడ్డుగా ఉన్నాడని మల్లమ్మ, ప్రియుడు చింకతల వెంకటయ్య కలిసి బాలస్వామిని 2021లో రోకలి బండతో తలపై బాది హత్య చేశారు. అప్పటి గోపాల్‌పేట ఎస్‌ఐ రామన్‌గౌడ్, సీఐ ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో కేసు వాదనలు జరగగా నిందితులకు శిక్ష పడేలా పోలీసులు సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పీపీ గోపాల్‌రెడ్డి వాదనాలు వినిపించగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎంఆర్ సునీత ఆకునమోని మల్లమ్మ, చింతకల వెంకటయ్యకు జీవితకాల జైలుతో పాటు రూ.14వేల జరిమానా విధించినట్లు ఎస్పీ తెలిపారు. శిక్ష పడటానికి కృషి చేసిన ప్రస్తుత ఎస్‌ఐ నరేష్, సీఐ కృష్ణయ్య, కోర్టు లైజనింగ్ అధికారి సత్యం, కోర్టు కానిస్టేబుల్ రమేష్‌నాయక్‌ను ఎస్పీ అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

కల్వకుర్తి టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష పడినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి గురువారం తెలిపారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో నిర్వహించిన తనిఖీలో కల్వకుర్తి మండలంలోని ఎల్లికల్ గ్రామానికి చెందిన పలాడి రామకృష్ణ మద్యం తాగి వాహనాన్ని నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. అతన్ని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి రెండు రోజుల జైలు శిక్ష, రూ.వంద జరిమాన విధించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రైస్‌మిల్లులపై విజిలెన్స్ దాడులు?

గద్వాల క్రైం, మే 29 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం సివిల్ సప్లయ్ గోదాముల్లో విజిలెన్స్ అధికారులు దాడులు చేసినట్లు సమాచారం. గోదాములతో పాటు ఎంఎల్ఎస్ పాయింట్లలో రేషన్ బియ్యం నిల్వలు ఎక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో ఈ తనిఖీలు నిర్వహించి వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. జిల్లా కేంద్రంలోని కొన్ని రైస్ మిల్లులలో రేషన్ బియ్యం ఎక్కువగా ఉన్నట్లు వారి దృష్టికి రావడంతో మొదట వాటిని తనిఖీ చేసి, ఆ తర్వాత గోదాములలోకి వెళ్లి తనిఖీలు చేసినట్లు సమాచారం. ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎక్కువ మొత్తంలో రేషన్ బియ్యం ఉన్నట్లు విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో వెల్లడైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. దీనికి తోడు ప్రభుత్వం మూడు నెలల బియ్యం ఒకేసారి రేషన్ దుకాణాలకు ఇవ్వాలని ఆదేశాలు రావడం, ఈ క్రమంలో అక్రమాలకు అవకాశాలు ఉంటాయన్న ఉద్దేశంతో తనిఖీ చేశారని సమాచారం. సివిల్ సప్లయ్ డీఎం. విమలను వివరణ కోరగా.. పూర్తి సమాచారం తమ దృష్టికి రాలేదన్నారు. విజిలెన్స్ వారు అందుబాటులోకి రాగానే వివరంగా వెల్లడిస్తామన్నారు.

కన్నోళ్లకు కన్నీళ్లు.. గడప దాటి కష్టాలు

(5వ పేజీ తరువాయి)

180 మంది, ఈ ఏడాది మే 25 నాటికి 80 మంది ప్రేమ పేరుతో ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు పోలీస్ రికార్డులు చెప్తున్నాయి. ఉమ్మడి పాలమూరులో గత ఏడాది దాదాపు 725 మంది, ఈ ఏడాది ఇప్పటి వరకు 276 మంది గడపదాటారు. ఇవి పోలీస్‌స్టేషన్లకు ఫిర్యాదులు వచ్చి నమోదైన కేసులు మాత్రమే. పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లకుండా గుట్టుగా సెటిల్ చేసుకున్నవి.. పరువు కోసం వదిలేసిన కేసులు రికార్డుల్లో నమోదైన గణాంకాల కన్నా ఎక్కువగా ఉంటాయి. ఇలా కన్నోళ్లను కన్నీళ్లు పెట్టిస్తున్న ఉందంతాలు ఆందోళన కలిగిస్తున్నాయి. పోలీస్‌స్టేషన్లలో మిస్సింగ్ కేసు నమోదైనా, వారం రోజులకే పెళ్లి చేసుకుని రావడం, లేదంటే తాము మేజర్లమని రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయిస్తున్నారు.


మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయం

గత ఏడాది 342 పోక్సో కేసులు

మిస్సింగ్ కేసులతో పాటు పోక్సో కేసులు ఆందోళన కలిగిస్తున్నాయి. గతేడాది ఉమ్మడి పాలమూరు జిల్లాలో 342 పోక్సో కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఒక్క పాలమూరు జిల్లాలోనే 5 నెలల్లో 44 కేసులు నమోదయ్యాయి. పోక్సో కేసుల్లో రెండు రకాలుంటాయి. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినా, మైనారిటీ తీరక ముందు ఇద్దరూ ఇష్టపడి ప్రేమ పేరుతో వెళ్లినా, పెళ్లి చేసుకున్నా పోక్సో కేసు నమోదవుతుంది. అలాగే అమ్మాయికి 18 ఏళ్ళు అబ్బాయి కి 21 ఏళ్ళు నిండకుండా ఇష్ట ప్రకారం పెళ్ళి చే సుకున్నా బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో కే సు నమోదవుతుంది. ఇదే నెలలో ఓ ప్రేమ జంట జిల్లా కేంద్రంలోని ఓ పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. తామిద్దరం మేజర్లమేనని, రక్షణ కల్పించాలని కోరింది. తీరా వారి వయసు ధ్రువీ కరణ పత్రాలను పోలీసులు పరిశీలించగా, అమ్మాయి మేజర్‌గా కాగా, అబ్బాయికి 19 ఏళ్ళు ఉన్నాయి. దీంతో కేసు బుక్ చేస్తామని పోలీసులు చెప్పడంతో ఆ జంట కన్న వారి చెంతకు చేరింది. ఒక వేళ పోక్సో కేసు నమోదయితే రెండు, మూడు నెలల వరకు బెయిల్ కూడా లభించదు.

బాధితులకు 'భరోసా'



ప్రేమ పేరుతో మోసపోయి భరోసాను ఆశ్రయించిన ఓ బాలికకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ ఇచ్చి.. కంప్యూటర్ శిక్షణ ఇవ్వడంతో ఆమెలో మార్పు వచ్చింది. సరైన వయసు రాకుండా ఇష్టపూర్వకంగా వెళ్లిపోయినా, పెళ్లి చేసుకున్నా పోక్సో కేసు నమోదై, అబ్బాయి జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ఒక్కోసారి ప్రేమ వ్యవహారం తల్లిదండ్రులకు తెలిసినా, బెదిరించి పెళ్లి సంబంధాలు చూస్తుండటంతో ఇంట్లోంచి వెళ్లిపోతున్నారు. సోషల్‌మీడియా పరిచయాలతో కూడా చాలా మంది గడప దాటుతున్నారు. ప్రేమ, పెళ్లికి సంబంధించి కీలకమైన నిర్ణయం తీసుకునే ముందు భవిష్యత్తును ఆలోచించుకోవాలి.

– సుజాత, ఎస్ఐ, భరోసా ఇన్‌చార్జి, మహబూబ్‌నగర్

అథ్లెటిక్స్‌లో అల్లీపూర్ విద్యార్థుల ప్రతిభ

చిన్నచింతకుంట, మే 29 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన ఏడురుగు విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం వనపర్తిలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో అండర్- 8 విభాగంలో టీ.అశ్విని 60, 200 మీటర్ల పరుగుపందెంలో బంగారు, వెండి పతకాలు సాధించింది. ఈ.సుచిత్ర బ్రాడ్ జంప్, బాల్‌త్రోలో బంగారు పతకం సాధించింది. డి.అర్జున్ 200 మీటర్లు, బాల్‌త్రోలో బంగారు పతకాలు సాధించాడు. ఎన్. సాయికిరణ్ 60మీటర్లు, బాల్‌త్రోలో వెండి పతకాలు సాధించాడు. అండర్-10 విభాగంలో కెగణేష్ లాంగ్‌జంప్‌లో బంగారు పతకం సాధించాడు. డీ.కురుమూర్తి కిడ్స్ జావిలెన్ త్రోలో, షాట్‌పుట్‌లో బంగారు పతకం సాధించాడు. ఏ.శ్రీధర్‌గౌడ్ 600 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం సాధించాడు. మొదటి స్థానంలో గెలుపొందిన క్రీడాకారులు వచ్చేనెల 1న సికింద్రాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్ పోటీలలో పాల్గొననున్నట్లు కోచ్ నవీన్ తెలిపారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కోచ్ నవీన్

హోరాహోరీగా సాగిన 2డే క్రికెట్ లీగ్

» గద్వాల జట్టు విజయం

» రాణించిన ఛత్రపతి, కేతన్ కుమార్

జడ్చర్ల, మే 29 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్-23 క్రికెట్ 2డే లీగ్‌లో గురువారం జడ్చర్ల జట్టుపై గద్వాల జట్టు విజయం సాధించింది. రెండు ఇన్నింగ్స్‌లో 328 పరుగులు గద్వాల జట్టు చేయగా, 298 పరుగులు జడ్చర్ల జట్టు చేసింది. 30 పరుగుల తేడాతో గద్వాల జట్టు విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో గద్వాల జట్టు 27.3 ఓవర్లలో 88 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జడ్చర్ల జట్టుకు చెందిన మణిచరణ్ 19 పరుగులు ఇచ్చి 6 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన జడ్చర్ల జట్టు 29 ఓవర్లలో 111 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. హర్షిత్ 42పరుగులు చేయగా, గద్వాల జట్టు బౌలర్లు వెంకటసాయి, విక్రమ్ చెరో మూడు వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన గద్వాల జట్టు 40ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 240 పరుగులు చేసింది. గద్వాల జట్టుకు చెందిన ఛత్రపతి 83 పరుగులు చేశాడు. జడ్చర్ల జట్టులోని బౌలర్లు పవన్, అక్షయసాయి చెరో రెండేసి వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన జడ్చర్ల జట్టు 39.5 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌట్ అయ్యారు. జడ్చర్ల జట్టులోని కేతన్ కుమార్ 66పరుగులు సాధించగా, గద్వాల జట్టు బౌలర్ విక్రమ్ 3 వికెట్లు తీశాడు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఉదేశ్, రాజశేఖర్, కోచ్ మహేష్, ముజీబ్ పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి

» జేఏసీ చైర్మన్ నామాని సునీందర్

దోమలపెంట, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ పంపిణీ సంస్థల ప్రైవేటీకరణ చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఈగలపెంట విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నామాని సునీందర్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా ఈగలపెంట జెన్‌కో సీఈ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు ఆందోళన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అనైతిక చర్యలను ఉపసంహరించకపోతే రాష్ట్ర జేఏసీ సూచనల మేరకు ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఈగలపెంట జెన్‌కో సీఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు, ఉద్యోగులు

కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక


జిల్లా స్థాయి పోటీలలో మెడల్స్ సాధించిన విద్యార్థులతో కోచ్ భాస్కర్

కొల్లాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బుధవారం అశ్విన్ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించిన తైక్వాండో పోటీలలో కొల్లాపూర్ తైక్వాండో కింగ్స్ క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారని కోచ్ భాస్కర్ యాదవ్ గురువారం తెలిపారు. సబ్ జూనియర్ విభాగంలో అండర్-16, 18, 23, 33, 77 కేజీల విభాగాలలో తేజస్ యాదవ్, రమ్య, పాండు, అజిత్, నక్షత్ర, రోహిత్ పాండ్యా గోల్డ్ మెడల్స్, వర్షిత్ యాదవ్, అఖిల్, నాగరాజు సిల్వర్ మెడల్స్, అభితేజ్, చరణ్‌తేజ్, సాత్విక్, శ్రీనాథ్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులు ఈనెల 31, జూన్ 1వ తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో నాగర్‌కర్నూల్ జిల్లా తరఫున ప్రాతినిథ్యం వహించనున్నారు.

వచ్చే నెల 12, 13 తేదీల్లో రాష్ట్ర వాలీబాల్ అకాడమీ ఎంపికలు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వాలీబాల్ అకాడమీలో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో(ఎఫ్ఏసీ) మధుసూదన్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 12, 13వ తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రధాన స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జూన్ 30, 2009 నుంచి జులై 1, 2011 మధ్య జన్మించిన అండర్-14 నుంచి 16 ఏళ్ల బాల,బాలికలు అర్హులని పేర్కొన్నారు. బాలుర ఎత్తు 182 సెం.మీ., బాలికల ఎత్తు 166 సెం.మీ. పైబడి ఉండాలని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అకాడమీకి ఎంపిక చేస్తామని వెల్లడించారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో సర్టిఫికెట్లు సాధించిన వారి మొదటి ప్రాధాన్యత ఉంటుందని వివరించారు. ఒరిజినల్ జనన ధ్రువపత్రం, బోనఫైడ్, ఆధార్, రెసిడెన్షియల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలని తెలిపారు.

1న ఉమ్మడి జిల్లా మహిళా క్రికెట్ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ మే 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) మహిళా క్రికెట్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలను జూన్ 1న నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రంతో ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్‌లోని ఎండీసీఏ మైదానంలో రిపోర్టు చేయాలని కోరారు. వైట్ షూ, వైట్ డ్రెస్‌తో హాజరుకావాలని తెలిపారు.

కొనసాగుతున్న ఏపీఎల్ క్రికెట్ టోర్నీ


క్రికెట్ ఆడుతున్న ఇరు జట్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 29 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న అయ్యప్ప ప్రీమియర్ లీగ్ క్రికెట్(ఏపీఎల్)టోర్నీ ఉత్సాహంగా కొనసాగుతుంది. గురువారం రెండో రోజు పోటీలను సమితి జిల్లా అధ్యక్షుడు సీమనరేందర్ ప్రారంభించారు. అయ్యప్పభక్త బృందం, తేజ 11 టీడీగుట్ట, సర్కార్ ఎస్సార్ కాలనీ, వరుణ్‌యాదవ్ జట్టు, అరవింద్ 11, యాపిల్ రఘు తిమ్మాసానిపల్లి, 11 స్టార్స్ సుజిత్ లెవెన్ జట్టు గెలిచాయి.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

గండీడ్, మే 29 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీలు హద్దు మీరి వైద్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా మాస్ మీడియా అధికారి మంజుల అన్నారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలంలోని వెన్నాచేడ్ గ్రామంలో బుధవారం వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం జిల్లా బృందం వచ్చి పరిశీలించి ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేశారు. గండీడ్ వైద్యాధికారి చంద్రశేఖర్, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి ఉన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

పాలమూరు, మే 29 (ఆంధ్రజ్యోతి): చర్చలతో సమస్యలు పరిష్కరించుకుందామని మావోయిస్టులు పలుమార్లు చెప్పినా కేంద్రం పట్టించుకోకుండా కాల్చి చంపుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ విమర్శించారు. గురువారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పౌరులను చంపే హక్కు. మోదీ, అమిత్‌షాలకు లేదన్నారు. దేశంలోని ఉపాధి కూలీలకు బడ్జెట్ రెండున్నర లక్షల కోట్లు పెంచాలని కోరితే కేవలం రూ.86వేల కోట్ల కేటాయించి పేదలకు ఉపాధి లేకుండా చేశారన్నారు. 30వ తేదీన జరిగే వ్యవసాయ కూలీ రేట్ల పెంపున్కై కలెక్టరేట్ల ముట్టడికి సీపీఎం మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఒక్క శాతం మందితో 40శాతం సంపద పోగై కార్పొరేట్ల దేశంగా మారుతోందన్నారు. ఆర్థిక అసమానతలు దేశంలో వేగంగ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు త్రిపుల్ ఐటీ రావడం సంతోషకరమన్నారు. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. భారత్-పాకిస్తాన్ యుద్ధ సమయంలో తనవల్లే రెండు దేశాలు యుద్ధం ఆపాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బాహాటంగ చెబుతుంటే.. ప్రధాని మోదీ తన వైఖరేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. పహల్గాం ఘటనపై దేశంలో తిరంగా యాత్రలు, ర్యాలీలు, సభలు చేస్తున్నారు. ఆ ఘటనలో చనిపోయిన 26మంది అమాయకులకు నేటికి న్యాయం జరగలేదని, దోషులను నేటికి పట్టుకోలేదన్నారు. ఎంపీ బృందాలను ఏకపక్షంగ విదేశాలకు పంపించి వారితో మాట్లాడించటం మంచిదే అయినా.. బీజేపీ ఏకపక్షంగా ఎంపీల పేర్లను ప్రకటించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

మద్దతు ధరలు సరిగా లేవు

కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు సరిగా లేవని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.సాగర్ తెలిపారు. రైతు పెట్టుబడికి 50శాతం కలిపి ఇవ్వాలని చెప్పిన స్వామినాథన్ కమిషన్ సిపారసులను పట్టించుకోలేదన్నారు. కేవలం క్వింటాలుకు రూ.69 పెంచటం సరికాదన్నారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పరిధిలో ఉదండాపూర్, మల్లూరు 15 తండాల ప్రజల నిర్వాసితులు అవుతున్నారని జిల్లా కార్యదర్శి ఏ.రాములు ఆవేదన వ్యక్తం చేశారు. జయలక్ష్మి, కిల్లెగోపాల్, నల్లవెల్లి కురుమూర్తి, పద్మ పాల్గొన్నారు.

పాలమూరు జిల్లాలో మోస్తరు వర్షం

» ఊట్కూర్‌లో 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం

నారాయణపేట/ధరూరు/గట్టు/గద్వాల, మే 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం మోస్తరు వర్షం కురిసింది. దీంతో అక్కడక్కడ కల్లాల్లోని ధాన్యం తడిసింది. రోడ్లపైకి నీరు చేరింది. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో 86.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. నారాయణపేట మండలంలో 61.8 మి.మీ., మరికల్‌లో 55.5 మి.మీ., మక్తల్ మండలంలో 44.0 మి.మీ., ధన్వాడలో 35.5 మి.మీ., కృష్ణ మండలంలో 31.8 మి.మీ., దామరగిద్ద మండలంలో 31.0 మి.మీ., కొత్తపల్లి మండలంలో 29.8 మి.మీ. మాగనూర్ మండలంలో 29.0 మి.మీ., నర్వ మండలంలో 20.0 మి.మీ., మద్దూర్ మండలంలో 17.8 మి.మీ. వర్షపాతం నమోదైంది.

జోగుళాంబ గద్వాల జిల్లాలో కేటీదొడ్డిలో లో 42.6, ధరూర్‌లో 75.2, గద్వాలలో 64.1, ఇటిక్యాలలో 39.4, మల్దకల్‌లో 55.3, గట్టులో 58.9, అయిజలో 31.6, రాజోలిలో 13.1, వడ్డేపల్లిలో 22.1, మానవపాడులో 26.5, ఉండవల్లిలో 34.9, అలంపూర్‌లో 22.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

వనపర్తి జిల్లా ఆత్మకూరులో 30.4 మి.మీ., వనపర్తి 28.8, కొత్తకోట 26.2, అమరచింత 25.2, మదనాపూర్ 23.4, చిన్నంబావి 17.4, పెద్దమందడి 15.6, గోపాల్‌పేట 12.4, రేవల్లి 7.0, ఖిల్లాఘణపూర్ లో 1.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

మట్టి గోడ కూలి.. ఆరు మేకలు మృతి

మరికల్ (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో హరిజన్‌వాడలో మట్టి గోడ కూలి ఆరు మేకలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండేటి తిరుమలయ్య మేకలను ఇంటి వద్ద కట్టేయగా పక్కన ఉన్న పాత గోడ కూలి మేకలపై బుధవారం రాత్రి పడి అక్కడిక్కడే మృతి చెందాయి. గురువారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రెడ్డి, సూర్య మోహన్‌రెడ్డి మేకలను పరిశీలించారు. మృతి చెందిన ఆరు మేకలు విలువ రూ.1.50 లక్షలు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

ఇంటర్వ్యూ..

వచ్చే నెల 2వ తేదీ నుంచి వందరోజుల పట్టణ ప్రణాళిక

- మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్



కల్వకుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతీ ఒక్కరు పాటించాలని కల్వకుర్తి మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ అన్నారు. తమ ఇళ్లల్లోని తడి, పొడి చెత్తలను వేరు చేసి మునిసిపల్ సిబ్బందికి ఇవ్వాలని సూచించారు. జూన్ 2 నుంచి సెప్టెంబరు 10వరకు వంద రోజుల పాటు పట్టణ ప్రణాళిక చేపట్టబోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ మహమ్మద్ షేక్ ఆంధ్రజ్యోతికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

వంద రోజుల పట్టణ ప్రణాళికలో ఏఏ అంశాలను చేపడుతారు ?

జూన్ 2వ తేదీ నుంచి వంద రోజుల పాటు చేపట్టే పట్టణ ప్రణాళికలో అన్ని రోడ్లను, అన్ని మురుగు కాల్వలను శుభ్రం చేయిస్తాం. తడి పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని, నీటి నిల్వలు ఉండరాదని, దోమల వల్ల అంటు వ్యాధులైన మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండే అంశాలపై పట్టణ ప్రజలకు అవగాహన కలిగిస్తాం. మునిసిపల్ సిబ్బందికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తాం. పట్టణ పచ్చదనం పెంచేందుకు ర్యాలీలు నిర్వహించడంతో పాటు అవగాహన కల్పిస్తాం.

పట్టణంలో ఎన్ని గృహాలు ఉన్నాయి జనాభా ఎంత?

కల్వకుర్తి పట్టణంలో సుమారు 10వేల ఇళ్ల వరకు ఉండగా, 2011 జనాభా లెక్కల ప్రకారం 30,091ల మంది జనాభా కాగా ప్రస్తుతం సుమారు 46వేల జనాభా ఉండవచ్చు.

ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?

మిషన్ భగీరథలోని ఆరు వాటర్ ట్యాంకుల ద్వారా 5.3ఎంఎల్‌డీ వాటర్‌ను కుళాయిల ద్వారా పట్టణ జనాభాకు సరఫరా చేస్తున్నాం. తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేదు.

కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ఇది వరకే చాలా కాలనీల్లో డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టాం. ప్రస్తుతం రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తైంది. త్వరలోనే ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన చేయిస్తాం.

న్యూస్ బాక్స్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

వంగూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు ఆరు వందలు చెల్లించి, సంవత్సరానికి 2 వందల పనిదినాలు కల్పించాలని కోరారు.


తక్షణమే రోడ్డు పనులు చేపట్టాలి

కోడేరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఏదుల రిజర్వాయర్‌పై కోడేరు-నాగర్‌కర్నూల్ వెళ్లే ప్రధాన రహదారిపై రోడ్డు పనులను వెంటనే చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శితో పాటు సీపీఎం బృందం రోడ్డును పరిశీలించారు. రిజర్వాయర్ కట్టపై చిన్నపాటి వర్షానికి మొత్తం బురదమయై వాహనాలకు, ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టెండర్లు పూర్తయినా పనులు చేపట్టకపోవడంతో గతేడాది సీపీఎం ఆధ్వర్యంలో సంబంధిత కాంట్రాక్టర్‌ను రోడ్డు పనులు త్వరగా చేపట్టాలని కోరగా, త్వరలోనే పనులు పూర్తి చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారని వారు గుర్తు చేశారు. నీరడి రవి, గ్రామ యువకుడు కురువ రమేష్ ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బేస్‌మెంట్ బిల్లులు మంజూరు

పెద్దకొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రబండతండా గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ నిర్మించుకున్న నలుగురు లబ్ధిదారులకు గురువారం రూ.లక్ష చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమయ్యాయి. ముడావత్ చిట్టెమ్మ, పాత్లావత్ మౌనిక, ముడావత్ పెంటమ్మ, పాత్లావత్ ఉమా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున బిల్లులను తాజా మాజీ సర్పంచ్ రాంలాల్, మండల నాయకులు చంద్రయ్య యాదవ్‌లు అందజేశారు. ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు త్వరగా నిర్మించుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ యాదవ్, హరిలాల్, బాలు సంతోష్, లాలు, లక్ష్మణ్, బిక్యనాయక్ పాల్గొన్నారు.

నాగులపల్లిలో రైతు మల్లేపల్లి వెంకట్‌రెడ్డి మృతి



వెంకట్‌రెడ్డి (ఫైల్)

కోడేరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగులపల్లి గ్రామంలో కోడేరు సింగిల్ విండో డైరెక్టర్ మల్లేపల్లి జగన్మోహన్‌రెడ్డి తండ్రి మల్లేపల్లి వెంకట్‌రెడ్డి గురువారం మృతి చెందారు. గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉండేవారు. ఆయన మృతితో గ్రామస్థులు కన్నీటి పర్యంత మయ్యారు. ఆయన భౌతికకాయాన్ని శుక్రవారం ఖననం చేయనున్నట్లు జగన్మోహన్‌రెడ్డి తెలిపారు.

వ్యవసాయానికి లో ఓల్టేజీ సమస్య రానివ్వం

- ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

- రూ.25 కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్ మంజూరుకు చర్యలు



రైతులకు ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : రైతులను అన్ని విధాలుగా ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు రూ.25కోట్లతో 132/33 కేవీ సబ్ స్టేషన్ మంజూరు చేయించడంతో పాటు అవసరమైన 33/11కేవీ మంజూరు చేసి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కల్వకుర్తి, వెల్దండ మండలాలకు చెందిన రైతులకు మంజూరైన 50 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు గురువారం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రైతులకు ఎలాంటి లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా విద్యుత్ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో కొత్తగా 12 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందిరా సౌరగిరి జల వికాస్ కింద నియోజకవర్గంలోని కడ్తాల్, ఆమన్‌గల్ మండలాల్లో పోడు భూములు సాగు చేసుకుంటున్న చెంచులకు గిరిజనులకు ఇందిరా సౌరగిరి జల వికాస్ పథకం వర్తిస్తుందన్నారు. పట్టణంలో ఇళ్లపై ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని, డబుల్‌బెడ్రూం ఇళ్లల్లో మీటర్ల ఏర్పాటుకు రూ.25లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మాజీ సభ్యుడు ఠాకూర్ బాలాజీసింగ్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బృంగి ఆనంద్‌కుమార్, మాజీ సర్పంచ్ పసుల సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్ కుమార్ యాదవ్, అశోక్‌రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, నరసింహ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల రాములు, మార్కెట్ డైరెక్టర్లు పసుల రమాకాంత్‌రెడ్డి, కొండల్, ఏడీఈ శంకరయ్య, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

రేపటి ఆధ్యాత్మిక ర్యాలీని విజయవంతం చేయాలి

- అహిల్యాబాయి హోల్కర్ త్రిశతజయంతి ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి

కందనూలు, మే 29 (ఆంధ్రజ్యోతి) : పుణ్యశ్లోక లోకమాత జయంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అహిల్యాబాయి హోల్కర్ త్రిశతజయంతి ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె త్రిశతజయంతి పురస్కరించుకొని ఈనెల 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. లోకమాత అహిల్యాబాయి రూపొందించిన పుస్తకాలను పంపిణీ చేశామని, వ్యాసరచన, చిత్రలేఖనం, వర్క్‌షాపు, సెమినార్, ప్రచార కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. అహిల్యాబాయి 300పుట్టిన తిధి 31మే శనివారం మధ్యాహ్నం 2గంటలకు భవ్యమైన ర్యాలీని నాగర్‌కర్నూల్ పట్టణంలో బీజేపీ కార్యాలయం నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి మాకం చంద్రకళ, ఉత్సవ కమిటీ సభ్యుల కొండకింది లక్ష్మి, సోమప్రగతిగౌడ్, పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్‌కుమార్, అతినారపు వెంకటేశ్ తదితరులు పాల్గొని అహిల్యమ్మ జీవిత చరిత్ర పుస్తకాలు చిత్ర పటాలను విడుదల చేశారు.

విద్యార్థి, యువతకు సాంస్కృతిక చైతన్యం అవసరం



విద్యార్థుల పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న సీఐ మహేశ్

కొల్లాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ పట్టణంలోని మినీ స్టేడియంలో కొన్ని రోజులుగా కొనసాగుతున్న సాంస్కృతిక కళాశిక్షణ శిబిరాన్ని కొల్లాపూర్ సీఐ మహేష్, ఎస్ఐ హృషికేష్‌లు గురువారం సందర్శించారు. ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన సాంస్కృతిక కళాశిక్షణ తరగతులకు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఆహ్వానం మేరకు సీఐ, ఎస్ఐ సందర్శించారు. శిక్షణ కార్యక్రమం నిర్వహించడంపై ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. అనంతరం వారు పేరిణి నాట్యం, బోనాల కోలాటం, కర్ణాటక సంగీతం, పెయింటింగ్, కేంద్రాలను సందర్శించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

వీరమనాయని చెరువులో అధికారుల సర్వే



అధికారులకు వివరిస్తున్న మాజీ సర్పంచ్ నాగరాజు

కొల్లాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యన్మన్‌బెట్ల గ్రామంలో గల వీరమనాయని చెరువుకు సాగునీరు అందించేందుకు గురువారం ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రామంలో సర్వే నిర్వహించారు. వీరమనాయని చెరువుకు సాగునీరు అందించేందుకు ఉన్న మార్గాలను ఇరిగేషన్ శాఖ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. భీమా కాలువ పసుపుల కెనాల్, సింగోటం శ్రీవారి సముద్రం ఈ మూడు మార్గాల ద్వారా వీరమనాయని చెరువుకు నీటిని ఏమార్గం ద్వారా తీసుకువస్తే ఉపయోగంగా ఉంటుందో అధికారులు పరిశీలించారు. రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో వీరమనాయని చెరువుకు సాగునీటి కల సాకారం కావొచ్చిందని గ్రామ మాజీ సర్పంచ్ మేకల నాగరాజు వెల్లడించారు. సర్వేలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ నిరంజన్ రావు, మాజీ సర్పంచ్ ఆశం నాగరాజు, నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసులు



తనిఖీలో పట్టుబడ్డ వాహనాలను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

అచ్చంపేటటౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : నంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం పట్టణంలోని సర్కిల్స్‌లో వాహనాలను సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్‌లు తనిఖీ నిర్వహించారు. పత్రాలు, నంబర్‌ప్లేట్స్‌లేని 76వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరి తమ వాహనాలకు నెంబర్ ప్లేట్స్ అమర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, పవన్‌కుమార్, గిరిమనోహర్ సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి

తిమ్మాజిపేట : వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ఐ హరిప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపవద్దని, చిన్నారులకు వాహనాలు ఇవ్వవద్దని అన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుపై అదేవిధంగా అట్రాసిటీ కేసులపై అవగాహన కల్పించారు. షీటీమ్స్ ద్వారా మహిళలకు సంరక్షణ కల్పిస్తారని తెలిపారు. ఏఎస్ఐలు శ్రీనివాసులు, సిబ్బంది నరసింహ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- ఎస్ఐ జి.మాధవరెడ్డి



కల్వకుర్తి : షాపులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ మాధవరెడ్డి, ఏవో సురేష్

కల్వకుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలైజర్ షాపుల డీలర్లు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మాధవరెడ్డి హెచ్చరించారు. కల్వకుర్తి పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను ఏవో సురేష్, టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులతో కలిసి ఆయన తనిఖీ చేశారు.

అనుమతి లేని విత్తనాలు అమ్మితే నేరం

తాడూరు : ప్రభుత్వ అనుమతి లేని పత్తి విత్తనాలు ఎవరూ విక్రయించినా అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గురుస్వామి హెచ్చరించారు. శనివారం మండలంలోని గుంతకోడూరు గ్రామంలో విత్తనాల దుకాణాలను ఎస్ఐతో పాటు ఏవో సందీప్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. ప్రతీ రైతు తాము తీసుకునే పత్తి విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా ఆ షాపునకు సంబంధించి రసీదు పొందాలని సూచించారు.

జటప్రోలులో తనిఖీలు

పెంట్లవెల్లి : మండల పరిధిలోని జటప్రోలు గ్రామంలో గురువారం మండల వ్యవసాయ అధికారి వికాస్ తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్, బిల్‌బుక్స్ పరిశీలించారు. జటప్రోలు విస్తరణ అధికారి విష్ణు, ఎస్ఐ రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీడ్స్ ఫర్టిలైజర్ షాపుల ఆకస్మిక తనిఖీ

పెద్దకొత్తపల్లి : మండల కేంద్రంలోని సీడ్స్ ఫర్టిలైజర్, పురుగు మందుల షాపుల్లో గురువారం వ్యవసాయ, పోలీస్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. షాపుల వద్ద స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలని అధికారులు సూచించారు. మండల వ్యవసాయ అధికారి శిరీష, ఎస్ఐ సతీష్ పాల్గొన్నారు.

గోవధశాలపై చర్యలు తీసుకోవాలి



కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న బజరంగ్ దళ్ నాయకులు

కొల్లాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ పట్టణంలో కొందరు వ్యక్తులు ఆవులను గోవధశాలకు పంపుతున్నారని అలాంటి వాటిని అరికట్టాలని కోరుతూ గురువారం కొల్లాపూర్ మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌కు బజరంగ్ దళ్ నాయకులు ఫిర్యాదు చేశారు. వ్యవసాయానికి పని చేసే ఎద్దులను, ఆవులను రైతుల ముసుగులో కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలలో ఉన్న గోవధశాలకు వాహనాల ద్వారా తరలిస్తున్నారని పేర్కొన్నారు. కొల్లాపూర్ మునిసిపల్, పోలీస్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పులి భరత్, బజరంగ్‌దళ్ టౌన్ సంయోజక్ నాయకులు మహేష్, రవి, శివమణి, సాకేత్, హేమంత్, సహ, ఠాగూర్, గణేష్, శివశర్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెద్దకొత్తపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని పెద్దకొత్తపల్లి మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మండలంలోని వెన్నచెర్ల గ్రామానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.లక్ష 4వేల చెక్కును గురువారం ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు రవికుమార్, మాజీ సర్పంచ్ పి.చిన్నయ్య, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, ముచ్చపోతుల శంకర్, బాలునాయక్, పుట్ట రాముడు, ఇమామ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి యూటీఎఫ్ కృషి : ఎంఈవో

తాడూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి, పాఠశాలలను బలోపేతం చేసి తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంచడానికి టీఎస్‌యూటీఎఫ్ బడిబాట ప్రచార జాత కార్యక్రమం నిర్వహిస్తున్నదని ఎంఈవో జి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలో గురువారం టీఎస్ యూటీఎఫ్ ప్రచార జాత బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీఎస్‌యూటీఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పూర్వ అధ్యక్షుడు వహీద్‌ఖాన్, ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, తాడూరు మండల అధ్యక్షుడు కుర్మయ్య, ప్రధాన కార్యదర్శి శేషగిరి, ఎస్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్ రాములు, కోశాధికారి కోటేశ్వర్, నాయకులు వెంకటదాస్ పాల్గొన్నారు.

అలుగు వర్షినిని వెంటనే సస్పెండ్ చేయాలి : స్వేరోస్

తెలకపల్లి, మే 29 (ఆంధ్రజ్యోతి) : గురుకుల కార్యదర్శి అలుగు వర్షినిని సస్పెండ్ చేయాలని స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వివేకానంద చౌరస్తా దగ్గర స్వేరోస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిని గురుకులాల్లో విద్యార్థులు టాయిలెట్లు కడిగితేనే భోజనం డైనింగ్ టేబుల్ మీదకి వస్తుందని మాట్లాడడం స్పష్టంగా కుల వివక్షను ఎత్తి చూపుతున్నదని ధ్వజమెత్తారు. గురుకులాల్లో శానిటైజర్ వర్కర్లను తొలగించి ఆ పనులను విద్యార్థులు చేయించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో స్వేరోస్ జిల్లా నాయకులు సంపత్‌కుమార్, కొమ్ము రమేష్, టౌన్ అధ్యక్షుడు పరమేశ్వర్, ఉపాధ్యక్షుడు బల్మూరు మల్లేష్, కవికుమార్, చంద్రశేఖర్, కుర్మయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

తిమ్మాజిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని తహసీల్దార్ రామకృష్ణయ్య అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని మరికల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. వర్షాలు కురుస్తున్నాయని ధాన్యం తరలించడంలో వేగం పెంచాలన్నారు. రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు నిర్లక్ష్యం చేయవద్దని, వర్షం సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తహసీల్దార్ రామకృష్ణయ్య రైతులకు అవగాహన కల్పించారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి త్వరగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూస్తామని రైతులకు వివరించారు.

ప్రాజెక్టుల భూసేకరణను

వచ్చే నెల 6లోగా పూర్తి చేయండి

- కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, మే 29 (ఆంధ్రజ్యోతి) : ప్రాజెక్టుల భూసేకరణ విషయంలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారులపై కలెక్టర్ అసహనం వ్యక్తంచేశారు. పాలమూరు-రంగారెడ్డి, మార్కండేయ, మహాత్మాగాంధీ, కల్వకుర్తి ఎత్తిపోతల ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించి మిగిలిపోయిన భూసేకరణ పనులు అత్యంత వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్‌తో కలిసి నీటిపారుదల, రెవెన్యూ, సర్వే ల్యాండ్ అధికారులతో జిల్లాలో ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల పనులపై ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి సమీక్షిస్తున్నారని, అధికారులు కూడా నిబద్ధతతో పని చేసి సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. అత్యంత మొదటి ప్రాధాన్యతగా భూసేకరణ పనులు జూన్ 6నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణ, నీటిపారుదల శాఖ అధికారులు సత్యనారాయణరెడ్డి, పార్థసారథి, మురళి, జిల్లా సర్వే ల్యాండ్ అధికారి నాగేందర్, ఆర్డీవోలు మాధవి, సురేష్, భూసేకరణ విభాగం కలెక్టరేట్ సూపరింటెండెంట్ నారాయణ, తహసీల్దార్లు, రెవెన్యూ నీటిపారుదల శాఖల అధికారులు తదితరులు సమీక్షలో పాల్గొన్నారు.

6 నుంచి బడిబాట

జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో డీఈవో రమేష్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు, ఎంఈవోలు, సీడీపీవోలు, సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, పథకాల గురించి తల్లిదండ్రులకు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఏకరూప దుస్తులు జూన్8వ తేదీలోగా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలకు చేరవేయాలని డీఆర్‌డీఏ పీడీ చిన్న ఓబులేష్‌ను కలెక్టర్ ఆదేశించారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు పార్టీలే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ

కల్వకుర్తి, మే 29 (ఆంధ్రజ్యోతి) : పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గురువారం ఊర్కొండ, కల్వకుర్తి మండలాల సీపీఐ మూడవ మహసభలు మండల కార్యదర్శి పరశురాములు అధ్యక్షతన జరిగింది. బాలనరసింహ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక చట్టాలను అమలు పరుస్తోందని, నియంతృత్వ పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. మావోయిస్టులను మట్టుబెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్ చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కగార్‌ను వెంటనే నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటయ్య, శ్రీనివాసులు, దాసు, పురుషోత్తం, శ్రీరాములు, మహేష్, లక్ష్మణ్, శివుడు, ప్రకాశ్, నరసింహ ఉన్నారు.

ఉల్పరలో కార్యకర్త మృతికి ఎమ్మెల్యే సంతాపం

వంగూరు, మే 29 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కార్యకర్త మృతి బాధాకరమని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం ఉల్పర గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మల్లయ్య(32) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాల ఉంచి, నివాళి అర్పించారు. మల్లయ్య మృతి ఆ కుటుంబానికి, పార్టీకి తీరని లోటు అని, ఆర్థికంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌గౌడ్, క్యామ మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ అభయహస్తం అమలు చేయాలి'

కొల్లాపూర్, మే 29 (ఆంధ్రజ్యోతి) :భారతరత్న డా.బి.ఆర్ అంబేడ్కర్ అభయ హస్తం కింద దళితులకు రూ.12 లక్షలు ఇవ్వాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన పథకాలను విమర్శిస్తున్న రేవంత్‌రెడ్డికి అంతగా దళిత విద్యార్థులపై ప్రేమ ఉంటే మీరు ఎన్నికల సమయంలో ప్రవేశ పెట్టిన అంబేడ్కర్ అభయ హస్తం కింద 12 లక్షల రూపాయలు నిరుద్యోగ యువత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కనీసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క మండల కేంద్రంలో కూడా ఇంత వరకు ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో టీజేఎఫ్ పాత్ర అద్వితీయం

- టీజేఎఫ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

నాగర్‌కర్నూల్ టౌన్, మే 29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టుల ఫోరం (టీజేఎఫ్) పాత్ర అద్వితీయమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీజేఎఫ్ సిల్వర్ జూబ్లీ ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం జర్నలిస్టులందరు ఐక్యంగా పోరాడడమే కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను చాటిన యూనియన్‌గా టీజేఎఫ్ చరిత్రలో నిలుస్తుందన్నారు. సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికీ రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేసి సొంతింటి కల నెరవేరుస్తానని ఆయన హామీ ఇచ్చారు. టీయూడబ్ల్యూజే (హెచ్143) రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్లా ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే(హెచ్143) జాతీయ నాయకుడు జెమిని సురేష్, ఉమాశంకర్, రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజేష్‌గౌడ్, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్, ఫొటో జర్నలిస్టుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు శ్రీరాములు, షేక్ ఫరీద్, అహ్మదుల్లాఖాన్, భాస్కర్‌సాగర్, సత్యం, బాలస్వామి, సాజిద్, సి.వెంకటస్వామి, వెంకటేష్, సాదిక్, రామకృష్ణ, ఆర్‌టీవీ రాజేష్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

వృద్ధులకు రూ.4వేలు పెన్షన్ ఇవ్వాలి : సీపీఐ

అమ్రాబాద్ మే 29 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వృద్ధులు, వింతతులకు రూ 4వేలు పెన్షన్ ఇవ్వాలని సీపీఐ అచ్చంపేట నియోజవర్గం కన్వీనర్ పెరుమాళ్ల గోపాల్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం అమ్రాబాద్ మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ వద్దకు సీపీఐ డివిజన్ నాయకులు మల్లేష్‌తో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా గోపాల్ విలేకరులతో మాట్లాడుతూ వృద్ధులు, వింతంతులు పెన్షన్ డబ్బులు తీసుకోవడం కోసం గంటల తరబడి పోస్టాఫీస్ ముందు పడిగాపులు కాస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పెన్షన్ డబ్బులను పంపిణీ చేయడం కోసం పోస్టాఫీసులో ప్రత్యేక సిబ్బందిని నియమించాలని అన్నారు. పెన్షన్‌దారులకు 2016 రూపాయలు సక్రమంగా అందించడం లేదని ఆయన ఆరోపించారు. ఈ విషయంలో సంబంధిత ఉన్నతాధికారులు విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకో వాలని ఆయన డిమాండ్ చేశారు.

మొక్కలు సిద్ధం చేసుకోవాలి : ఏడీఆర్‌డీవో



ఉపాధి హామీ పనుల వద్ద రికార్డులను పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీవో రాజేశ్వరి

తిమ్మాజిపేట, మే 29 (ఆంధ్రజ్యోతి) : హరితహారంలో పథకంలో నాటేందుకు నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేసుకోవాలని అదనపు డీఆర్‌డీవో రాజేశ్వరి సూచించారు. మండల పరిధిలోని మరికల్, మాన్యనాయక్‌తండా గ్రామ పంచాయతీల్లోని నర్సరీలను పరిశీలించి ఉపాధి హామీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకంలో కొనసాగుతున్న పనులను పరిశీలించి కూలీలతో ఆమె మాట్లాడారు. ఉపాధి హామీ కూలీల వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కూలీలకు సక్రమంగా డబ్బులు వారి ఖాతాలో పడేలా చూడాలని, వారి పని దినాలలో సరిపోను కూలీ రావాలని ఆ విధంగా కూలీలతో పని చేయించాలన్నారు. అంతకు ముందు మరికల్ గ్రామపంచాయతీ ఉపాధి హామీ సిబ్బందితో సమావేశమై పలు విషయాలపై మాట్లాడారు. ఏపీవో సత్యనారాయణ, టెక్నికల్ అసిస్టెంట్ బాలరాజు తదితరులు ఉన్నారు.